పరిహారం ప్రకటించాకే సర్వేకు రండి


అధికారులతో మాట్లాడుతున్న రైతులు

కరీంనగర్‌రూరల్: ఇరుకుల్లలో జాతీయ రహదారి నిర్మాణంలో భాగంగా భూములు కోల్పోతున్న రైతులతో కలెక్టర్ ఆర్‌వీ కర్ణన్ ఆదేశాల మేరకు ఆర్‌ఐ అస్మా, సర్వేయర్ రాకేశ్‌లు శుక్రవారం గ్రామంలోనే సమావేశమయ్యారు. ఎకరానికి ఎంత పరిహారం చెల్లిస్తారో ముందుగానే చెప్పాలని అన్నదాతలు డిమాండ్ చేశారు. ప్రభుత్వం మార్కెట్ రేట్ ప్రకారమే చెల్లిస్తుందని ఆర్‌ఐ చెప్పారు. కానీ పరిహారం ప్రకటించాకే సర్వేకు రావాలని రైతులు తేల్చిచెప్పారు. దీంతో అధికారులు ఉన్నతాధికారులకు సమాచారం అందించి, అక్కడి నుంచి వెళ్లిపోయారు.

ఐవీఎఫ్ సెంటర్లలో తనిఖీలు


వివరాలు తెలుసుకుంటున్న డాక్టర్ లలితాదేవి

కరీంనగర్‌టౌన్: జిల్లాలోని ఐవీఎఫ్ సెంటర్లలో శుక్రవారం ఏఆర్‌టీ, సరోగసి స్టేట్ మెంబర్ డాక్టర్ లలితాదేవి తనిఖీలు నిర్వహించారు. నిబంధనల ప్రకారం సెంటర్లను నడుపుతున్నారా.. లేదా అనే అంశాలపై ఆరా తీశారు. జిల్లా కేంద్రంలోని రజని ఫర్టిలిటీ, ఫర్టివిజన్, రేఖా సాగర్, పద్మజ, ఒయాసిస్, శ్రీ చంద్ర, అమృత, అరూస్, తులసి ఐవీఎఫ్ సెంటర్లను తనిఖీ చేశారు. ఆయా ఆసుపత్రులపై రాష్ట్ర బోర్డుకు నివేదిక సమర్పించిన తర్వాత అనుమతులు మంజూరవుతాయని ఆమె పేర్కొన్నారు.

మహిళా రైతు మృతిపై విచారణ


వివరాలు సేకరిస్తున్న ఏవో సత్యం

కరీంనగర్‌రూరల్: మొగ్దుంపూర్‌లో ఇటీవల మహిళా రైతు కూకట్ల సరమ్మ మృతిచెందగా మండల వ్యవసాయాధికారి బి.సత్యం శుక్రవారం ఆమె ఇంటికి వెళ్లి, విచారణ చేపట్టారు. రైతుబీమా పథకంలో లబ్ధిదారుగా ఉన్న సరమ్మ మృతికి కారణాలు, నామినీగా ఉన్నవారి వివరాలను స్థానికులను అడిగి తెలుసుకున్నారు. రైతుబీమా పథకం కింద నామినీకి రూ.5 లక్షల పరిహారం మంజూరు కోసం ప్రభుత్వానికి నివేదిక ఇవ్వనున్నట్లు తెలిపారు. సర్పంచు జక్కం నర్సయ్య, ఉపసర్పంచు కూకట్ల తిరుపతి, ఇన్‌చార్జి ఏఈవో రమ్య, దుర్శేడ్ సింగిల్‌విండో డైరెక్టర్లు కందుల రమేశ్, దాడి లచ్చయ్య, రైతుబంధు సమితి గ్రామ కో–ఆర్డినేటర్ మంద తిరుపతి, అంజిరెడ్డి, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

చలివేంద్రం ప్రారంభం


ప్రారంభిస్తున్న అదనపు కలెక్టర్ శ్యాంప్రసాద్‌లాల్

కరీంనగర్‌టౌన్: అసోసియేషన్ ఆఫ్ అలయన్స్ క్లబ్, ఎస్‌కే అసోసియేట్ లా ఫర్మ్ ఆధ్వర్యంలో బాలికల కళాశాల రోడ్‌లోని రెడ్ క్రాస్ బిల్డింగ్ వద్ద ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని శుక్రవారం జిల్లా అదనపు కలెక్టర్ శ్యాంప్రసాద్‌లాల్ ప్రారంభించారు. కార్యక్రమంలో ఎలగందుల శ్రీనివాస్, గాలిపల్లి నాగేశ్వర్, ఈద కుమార్‌స్వామి, నజియా కుదైజ, చీకోటి శ్రీనివాస్‌గాంధీ, రేణుక, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

27న వేంకటేశ్వరస్వామి ఆలయ హుండీల లెక్కింపు

కరీంనగర్ కల్చరల్: నగరంలోని మార్కెట్ రోడ్ శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయ హుండీలను ఈ నెల 27న లెక్కించనున్నట్లు ఈవో ఉడుతల వెంకన్న ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటలకు కార్యక్రమం ప్రారంభమవుతుందని పేర్కొన్నారు.

మడేలేశ్వరస్వామి బోనాలు


బోనాలతో తరలివెళ్తున్న భక్తులు

కరీంనగర్‌రూరల్: కరీంనగర్ మండలంలోని మొగ్దుంపూర్‌లో శుక్రవారం రజక సంఘం ఆధ్వర్యంలో మడేలేశ్వర స్వామి బోనాలు ఘనంగా నిర్వహించారు. డప్పుచప్పుళ్ల మధ్య మహిళలు బోనాలతో ఊరేగింపుగా స్వామి వారికి ఆలయానికి చేరుకున్నారు. నైవేద్యం సమర్పించి, మొక్కులు చెల్లించుకున్నారు. రజక సంఘం నాయకులు మైలారం భూమయ్య, నాగరాజు, లచ్చయ్య, శ్రీనివాస్, కాల్వ మల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

బీఎస్పీ అధ్యక్షుడి అరెస్టుకు నిరసనగా ధర్నా


ధర్నా చేస్తున్న బీఎస్పీ నాయకులు

కరీంనగర్ కల్చరల్: గ్రూప్–1 పరీక్ష రద్దు కోసం శుక్రవారం ఆమరణ నిరాహార దీక్ష చేస్తున్న బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్‌ను పోలీసులు అరెస్టు చేయడాన్ని ఆ పార్టీ జిల్లా నాయకులు ఖండించారు. కరీంనగర్‌లోని తెలంగాణ చౌక్‌లో ధర్నా చేపట్టారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు నల్లాల శ్రీనివాస్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పవర్ కట్ ప్రాంతాలు



కొత్తపల్లి: విద్యుత్ తీగలకు అడ్డుగా ఉన్న చెట్ల కొమ్మల తొలగింపు పనులు కొనసాగుతున్నందున శనివారం ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు 11 కేవీ రాంనగర్ ఫీడర్ పరిధిలోని పద్మనగర్, పరమేశ్వర రైస్‌మిల్, ఆదిత్య అపార్ట్‌మెంట్, చేపల మార్కెట్, శ్రీహరినగర్, సంతోష్‌నగర్, సత్యనారాయణ స్వామి దేవాలయం, సిద్ధార్థ స్కూల్, వాసర ఆసుపత్రి, పారమిత స్కూల్ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు టౌన్–2 ఏడీఈ ఎం.సుధీర్‌కుమార్ తెలిపారు. అలాగే ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు 11 కేవీ మంకమ్మతోట, రామచంద్రాపూర్ కాలనీ ఫీడర్ల పరిధిలోని మంకమ్మతోట మెయిన్‌రోడ్, పాన్నం కాంప్లెక్స్, కశ్మీర్ గడ్డ, శ్రీనగర్ కాలనీ, సప్తగిరికాలనీ, భగత్‌నగర్, రామచంద్రాపూర్‌కాలనీలతోపాటు 11 కేవీ శ్రీరాంనగర్ కాలనీ ఫీడర్ పరిధి శ్రీరాంనగర్ కాలనీ, ఆదిత్యనగర్, సాలంపుర, కొత్తయాస్వాడ, విద్యానగర్, విజయదుర్గకాలనీ, ఆర్టీసీ వర్క్‌షాపు వెనక ప్రాంతంలో విద్యుత్ సరఫరా ఉండదని పేర్కొన్నారు.

సిల్ట్‌పై నిర్లక్ష్యం.. వీధులన్నీ మురుగుమయం

- కరీంనగర్ నగరపాలక సంస్థ పరిధిలో 60 డివిజన్లు
- చాలాచోట్ల మురుగునీటితో నిండుతున్న డ్రైనేజీలు
- చిన్నపాటి వర్షం కురిసినా రోడ్లపై ప్రవాహం
- ఇబ్బందులు పడుతున్న ప్రజలు, ప్రయాణికులు


ఈ ఫొటోలో కనిపిస్తున్న డ్రైనేజీ తీగలగుట్టపల్లి శివారు ప్రాంతంలోనిది. సిల్ట్‌తో పూర్తిగా నిండిపోయి మురుగు నీరు దారిపై ప్రవహించే దుస్థితి. ప్రతీ డివిజన్‌లో ఇలాంటి డ్రైనేజీలు చాలా ఉన్నాయి. గత గురువారం రాత్రి కురిసిన చిన్నపాటి వర్షానికే పలుచోట్ల డ్రైనేజీలు పొంగిపొర్లి, నీరంతా రోడ్లపైకి వచ్చింది. సిల్ట్ తొలగించకపోవడం వల్లే ఈ పరిస్థితి నెలకొందని, దుర్గంధంతో తాము తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

కరీంనగర్‌సిటీ: కరీంనగర్ నగరపాలక సంస్థ పరిధిలో 60 డివిజన్లు, వీటి పరిధిలో సుమారు 680 కిలోమీటర్ల మేర డ్రైనేజీలున్నాయి. జనాభా 2.94 లక్షలు, ఇళ్లు 78,356, పారిశుధ్య కార్మికులు 1,060 మంది ఉన్నారు. డ్రైనేజీ ఆధునీకరణకు ఇటీవల సుమారు రూ.160 కోట్లు కేటాయించారు. ప్రతీ డివిజన్‌లో కనీసం 10 కిలోమీటర్ల దూరానికి పైగా డ్రైనేజీలు నిర్మించగా కొన్నిచోట్ల నిర్మాణంలో ఉన్నాయి. వీటిలో సుమారు 60 శాతం 20 ఏళ్ల క్రితం నిర్మించినవే. ప్రస్తుతం నగరం విస్తరించడం, జనాభా పెరిగిపోవడంతో ఆ డ్రైనేజీలు మురుగు నీటితో నిండిపోతున్నాయి. ఇటీవల పలుచోట్ల సిల్ట్ తొలగింపు పనులు చేపడుతున్నారు. చాలాచోట్ల తొలగించకపోవడంతో డ్రైనేజీలు ఎక్కడిక్కడే నిండిపోయి మురుగునీరు రోడ్లపై ప్రవహిస్తోంది. దీంతో ప్రజలు, ప్రయాణికులు నానాతంటాలు పడుతున్నారు. చిన్నపాటి వర్షం కురిస్తే చాలు డ్రైనేజీలు పొంగిపొర్లుతున్నాయని అంటున్నారు.

సిమెంటు, చెత్తాచెదారం తొలగించలే..

నగరంలో స్మార్ట్‌సిటీలో భాగంగా ప్రధాన రహదారుల వెంట మురుగు కాల్వలు నిర్మించి, వాటిపై స్లాబులు వేశారు. కానీ ఆ సమయంలో కాలువల్లో చెత్తాచెదారం, నిర్మాణ సమయంలో పడిన సిమెంట్‌ను తొలగించకపోవడంతో సగానికి పైగా డ్రైనేజీలు పనికిరాకుండా పోయాయని పలువురు అంటున్నారు. ఇటు ఆర్‌అండ్‌బీ, అటు కార్పొరేషన్ అధికారులు తమకేమీ పట్టనట్లు వ్యవహరిస్తుండటంతో ప్రజలు, ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారని చెబుతున్నారు. దీనికితోడు ప్లాస్టిక్ కవర్లు ఎక్కడపడితే అక్కడ పడేస్తుండటంతో నీటి ప్రవాహానికి అడ్డుగోడలా మారుతున్నాయి. ఛాంబర్లను తెరిచి, డ్రైనేజీలను శుభ్రం చేయాలని ప్రజలు కోరుతున్నారు.

వీధులన్నీ మురుగు నీటిలో...

నగరంలోని డివిజన్లలో ప్రధాన డ్రైనేజీలకు అనుసంధానంగా వీధుల్లో, కాలనీల్లో డ్రైనేజీలున్నాయి. ఇవి చిన్నగా ఉండటంతోపాటు వీటిలో చాలా వరకు ఎప్పుడో నిర్మించినవి కావడంతో కొంచెం సిల్ట్ పేరుకుపోయినా మురుగునీరు బయటకు వస్తోంది. ఇక వర్షం కురిస్తే ఆ సమస్యలు చెప్పలేనివి. కొన్ని డివిజన్లలో అయితే కాలనీల వీధులన్నీ మురుగు నీటిలో ఉంటున్నాయి. గతేడాది సిల్ట్ తొలగించడానికి టెండర్లు పిలిచినా వానాకాలం పూర్తయిన తర్వాత ఒకే చెప్పారు. దీంతో సిల్ట్ తొలగింపు ప్రక్రియ పూర్తిస్థాయిలో కాలేదు. కనీసం 30 శాతం డ్రైనేజీల్లోనూ పూడిక తీయలేదని సమాచారం. టెండర్ ప్రకారం నిధులు మాత్రం ఖర్చవుతున్నాయని తెలిసింది.

సిల్ట్ తొలగింపునకు చర్యలు

ఓపెన్ డ్రైనేజీలు ఉన్నచోట ఎప్పటికప్పుడు సిల్ట్ తొలగింపునకు చర్యలు తీసుకుంటున్నాం. ఎక్కడైనా సమస్యలు వస్తే వెంటనే పూడిక తీయించి, మురుగునీరు సాఫీగా వెళ్లేలా అధికారులకు ఆదేశాలిస్తున్నాం. అవసరమైతే ప్రత్యేక చర్యలు చేపట్టి, సిల్ట్ తొలగిస్తాం.

– సునీల్‌రావు, మేయర్, కరీంనగర్

చిత్ర కథ: ప్రమాదకరంగా కల్వర్టు


శాతవాహన యూనివర్సిటీ ఎదుట మూలమలుపు వద్ద కల్వర్టు పైకప్పు లేకపోవడంతో ప్రమాదకరంగా మారింది. ఎలాంటి ప్రమాదాలు జరగకముందే సంబంధిత అధికారులు పైకప్పు ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, కరీంనగర్

31లోగా ఆస్తిపన్ను చెల్లించండి

- మున్సిపల్ అదనపు కమిషనర్ స్వరూపారాణి
- పలువురికి నోటీసులు
- చెల్లించకపోతే ఆస్తులు జప్తు చేస్తామని హెచ్చరిక


నోటీసులు ఇస్తున్న మున్సిపల్ అధికారులు

కరీంనగర్‌సిటీ: ప్రజలు ఆస్తిపన్ను చెల్లించి, నగరపాలక సంస్థ అభివృద్ధికి సహకరించాలని మున్సిపల్ అదనపు కమిషనర్ స్వరూపారాణి కోరారు. పురపాలక చట్టం 2014 నియమ నిబంధనల ప్రకారం కరీంనగర్ నగరపాలక సంస్థ రెవెన్యూ బృందం ఆస్తి పన్ను మొండి బకాయిదారులపై కొరఢా ఝులిపించేందుకు సిద్ధమైంది. సీడీఎంఏ, నగర మేయర్ యాదగిరి సునీల్‌రావు, కమిషనర్ సేవా ఇస్లావత్‌ల ఆదేశాల మేరకు రెవెన్యూ విభాగం ప్రత్యేక చర్యలు చేపట్టింది. నగరంలో కొన్నేళ్లుగా పన్ను చెల్లించకుండా మొండి బకాయిదారులుగా ఉన్న పలువురి ఇళ్లు, దుకాణాల వద్దకు శుక్రవారం అదనపు కమిషనర్ స్వరూపరాణి, రెవెన్యూ అధికారులు వెళ్లారు. గతంలో చాలాసార్లు నోటీసులు ఇచ్చినా స్పందించలేదని, మరోసారి ఇచ్చారు. మార్చి 31న ఆర్థిక సంవత్సరం ముగుస్తున్నందున ఆలోగా పన్నులు చెల్లించాలని చెప్పారు. లేకపోతే పురపాలక చట్టం ప్రకారం మొండి బకాయిదారులకు వారెంట్లు జారీ చేసి, వారి ఇళ్లకు తాళాలు వేయడంతోపాటు విలువైన వస్తువులు లేదా ఆస్తులను జప్తు చేస్తామని హెచ్చరించారు. ఇంటి, నల్లా, ట్రేడ్ లైసెన్స్ పన్నులు సకాలంలో చెల్లించాలని సూచించారు. కార్యక్రమంలో రెవెన్యూ విభాగం అధికారి ఆంజనేయులు, ఆర్‌ఐ రషీద్, బిల్ కలెక్టర్లు, డిజాస్టర్ మేనేజ్‌మెంట్ సిబ్బంది పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ ఎన్నికల్లో విజయంపై బీజేపీ సంబరాలు


స్వీట్లు పంచుకుంటున్న బీజేపీ నాయకులు


డీఈవో జనార్దన్‌రావుకు స్వీట్ ఇస్తున్న నాయకులు

కరీంనగర్‌టౌన్: ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థి ఏవీఎన్ రెడ్డి విజయం సాధించడంపై ఆ పార్టీ జిల్లా శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం సాయంత్రం కరీంనగర్‌లోని తెలంగాణ చౌక్‌లో సంబరాలు నిర్వహించారు. టపాసులు పేల్చి, మిఠాయిలు పంపిణీ చేశారు. బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, జిల్లా ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే ఎన్వీఎస్ఎస్ ప్రభాకర్, జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డిలు మాట్లాడుతూ.. హైదరాబాద్, రంగారెడ్డి, మహబూబ్‌నగర్ శాసన మండలి ఎన్నికల్లో అందరి అంచనాలు తలకిందులయ్యేలా బీజేపీ అభ్యర్థి ఘన విజయం సాధించారని తెలిపారు. రాష్ట్రంలో రాబోయేది బీజేపీ సర్కారేనని ధీమా వ్యక్తం చేశారు. ఉపాధ్యాయులందరూ గొప్ప విజయాన్ని అందించారని, వారికి కృతజ్ఞతలు తెలుపుతున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కోమల్ల ఆంజనేయులు, జిల్లా ప్రధాన కార్యదర్శులు తాళ్లపల్లి శ్రీనివాస్ గౌడ్, క్లెంం వాసుదేవరెడ్డి, బత్తుల లక్ష్మీనారాయణ, కరీంనగర్ పార్లమెంట్ కన్వీనర్ బోయినపల్లి ప్రవీణ్‌రావు, జిల్లా ఉపాధ్యక్షులు గుర్రాల వెంకట్‌రెడ్డి, మాడ వెంకట్‌రెడ్డి, జిల్లా ఆఫీస్ సెక్రటరీ మాడుగుల ప్రవీణ్, మీడియా కన్వీనర్ కటకం లోకేశ్, వైద రామానుజన్, అధికార ప్రతినిధులు బొంతల కల్యాణ్ చంద్ర, జానపట్ల స్వామి, ఎడమ సత్యనారాయణ రెడ్డి, చొప్పరి జయశ్రీ, బండ రమణారెడ్డి, జాడి బాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

'ప్రభుత్వానికి బుద్ధి చెప్పారు'

ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థి ఏవీఎన్ రెడ్డి విజయంపై ఉపాధ్యాయ సంఘం మాజీ రాష్ట్ర నాయకుడు, బీజేపీ విశ్రాంత ఉద్యోగ ఉపాధ్యాయ సెల్ రాష్ట్ర కో–చైర్మన్ నరహరి లక్ష్మారెడ్డి హర్షం వ్యక్తం చేశారు. ఎనిమిదేళ్లుగా ఉపాధ్యాయుల నియామకం చేపట్టపోగా పదోన్నతులు ఇవ్వకుండా బదిలీలు చేయకుండా టీచర్లను ఇబ్బందుల గురిచేసిన ఘనత సీఎం కేసీఆర్ ప్రభుత్వానికే దక్కిందని విమర్శించారు. విద్యారంగ సమస్యలను పట్టించుకోని ఈ ప్రభుత్వానికి ఉపాధ్యాయులు తగిన బుద్ధి చెప్పారన్నారు. ఇకనైనా సర్కారు కళ్లు తెరిచి, ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్ల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు.

తపస్ నాయకులు...

కరీంనగర్: తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం (తపస్) బలపరిచిన ఏవీఎన్ రెడ్డి ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో విజయం సాధించడంతో సంఘం జిల్లా శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం సంబరాలు నిర్వహించారు. డీఈవో జనార్దన్‌రావు, ఆఫీస్ సిబ్బందికి స్వీట్లు పంచిపెట్టారు. సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు కట్ట రాజేశ్వర్, గన్నమనేని రంగారావు, రాష్ట్ర బాధ్యులు అంబటి వేణుకుమార్, అన్నమనేని తిరుపతిరావు, వెంకటరమణారావు, జగన్, శ్రీనివాస్, తపస్ బాధ్యులు పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణ బిల్లు ప్రవేశపెట్టాలి


మాట్లాడుతున్న రమేశ్‌కుమార్

కరీంనగర్: ప్రస్తుత పార్లమెంట్ సమావేశాల్లోనే ఎస్సీ వర్గీకరణ బిల్లు ప్రవేశపెట్టాలని మాదిగ రాజకీయ పోరాట సమితి, ఎమ్మార్పీఎస్ జాతీయ వ్యవస్థాపక అధ్యక్షుడు బీఎస్ రమేశ్‌కుమార్ డిమాండ్ చేశారు. కరీంనగర్‌లోని సంఘం కార్యాలయంలో ఎంఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు మాతంగి రమేశ్ అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎస్సీ వర్గీకరణ చేస్తామని హామీ ఇచ్చిన బీజేపీ అధికారంలోకి వచ్చి తొమ్మిదేళ్లవుతున్నా పట్టించుకోవడం లేదన్నారు. ఈ పార్లమెంటు సమావేశాల్లో వర్గీకరణ బిల్లు పెట్టి, మాదిగ, మాదిగ ఉపకులాలకు ఇచ్చిన మాట నిలబెట్టుకోవాలని కోరారు. లేనిపక్షంలో తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ సహా ఇతర దక్షిణాది రాష్ట్రాల్లో బీజేపీ నాయకులను అడ్డుకుంటామని హెచ్చరించారు. సీఎం కేసీఆర్ ఎస్సీ వర్గీకరణ కోసం అఖిలపక్షాన్ని ఢిల్లీ తీసుకెళ్లాలని, కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాలని డిమాండ్ చేశారు. ఎమ్మార్పీఎస్, ఎంఎంఎస్, ఎంఎస్ఎఫ్ నాయకులు వెంకటస్వామి, సారంగపాణి, కొమురక్క, చిరంజీవి, కుమార్, విల్సన్, ఆకాశ్, రమేశ్, పవన్‌కల్యాణ్, రాజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ప్రైవేట్ కళాశాలల హోర్డింగ్‌లు తొలగించాలి

కరీంనగర్: పట్టణంలో నిబంధనలకు విరుద్ధంగా ఏర్పాటు చేసిన ప్రైవేటు జూనియర్ కళాశాలల హోర్డింగ్‌లను తొలగించాలని నవ తెలంగాణ స్టూడెంట్ ఫెడరేషన్(ఎన్‌టీఎస్ఎఫ్) రాష్ట్ర అధ్యక్షుడు బుర్ర సంజయ్‌కుమార్ డిమాండ్ చేశారు. శుక్రవారం కరీంనగర్‌లోని సంఘం కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. అనధికారిక హోర్డింగ్‌లపై ఇంటర్మీడియట్ విద్యాశాఖ అధికారులకు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. మూడు నెలలుగా కరీంనగర్‌లో ఆయా కళాశాలల యాజమాన్యాలు విద్యార్థుల ఇళ్లకు వెళ్తూ అడ్మిషన్ తీసుకోవాలంటూ ఒత్తిడి చేస్తున్నాయని ఆరోపించారు. జిల్లా విద్యాశాఖ అధికారులకు ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదన్నారు. హోర్డింగ్‌లు తొలగించకపోతే విద్యార్థులతో కలిసి ధర్నా చేస్తామని హెచ్చరించారు. నాయకులు బారి అశోక్‌కుమార్, అమ్మ వెంకటేశ్, రాజశేఖర్, బద్దం ప్రవీణ్‌రెడ్డి, సాయికృష్ణ, రాకేశ్ తదితరులున్నారు.

ఉచితంగా న్యాయ సహాయం

శంకరపట్నం: మండలంలోని కన్నాపూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు శుక్రవారం చట్టాలపై కరీంనగర్ న్యాయస్థానం సీనియర్ సివిల్ జడ్జి సుజయ్ అవగాహన కల్పించారు. లీగల్‌సెల్ అథారిటీ ఆధ్వర్యంలో కేసులపై న్యాయసలహాలు పొందవచ్చన్నారు. పేదరికంతో న్యాయవాదిని నియమించుకోలేని వారికి లీగల్‌సెల్ ఉచితంగా న్యాయ సహాయం చేస్తుందని వివరించారు. కార్యక్రమంలో సర్పంచ్ వెంకటరమణారెడ్డి, ఎంపీటీసీ భాగ్యలక్ష్మి, హెచ్ఎం శ్రీనివాస్, న్యాయవాదులు మహేశ్, సురేశ్, అంగన్‌వాడీ కార్యకర్తలు, వార్డు సభ్యులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

'కార్యకర్తలు, రైతులను కాపాడుకుంటాం'


చెక్కు అందిస్తున్న ఎమ్మెల్యే రవిశంకర్

రామడుగు: బీఆర్ఎస్ కార్యకర్తలు, రైతులను కంటికి రెప్పలా కాపాడుకుంటామని చొప్పదండి ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ అన్నారు. మండలంలోని దేశరాజ్‌పల్లి గ్రామంలో శుక్రవారం కరెంట్ షాక్‌తో మృతిచెందిన ఊరడి సుదర్శన్ (బీఆర్ఎస్ కార్యకర్త) కుటుంబ సభ్యులకు రూ.రెండు లక్షల ప్రమాదబీమా చెక్కు, కంకణాల రఘు అనే రైతు అనారోగ్యంతో మృతి చెందగ రూ. ఐదులక్షల రైతు బీమా చెక్కు ఆయన కుటుంబ సభ్యులకు అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ప్రభుత్వం రైతుబీమా పథకం ద్వారా మృతిచెందిన రైతుల కుటుంబాలకు భరోసా కల్పిస్తోందని, దేశానికి పథకం ఆదర్శంగా నిలుస్తోందని చెప్పారు. కార్యక్రమంలో గోపాల్‌రావుపేట మార్కెట్ కమిటీ చైర్మన్ మామిడి తిరుపతి, బీఆర్ఎస్ మండలశాఖ అధ్యక్షుడు గంట్ల జితేందర్‌రెడ్డి, మాజీ ఎంపీపీ తవుటు మురళీ, ఎంపీటీసీ వంచ మహేందర్‌రెడ్డి, సర్పంచ్ కోల రమేష్, రైతుబంధు కమిటీ మండల కోఆర్డినేటర్ జూపాక కరుణాకర్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ ఎల్కపల్లి లచ్చయ్య పలువురు పాల్గొన్నారు.

ఆడబిడ్డలకు సర్కారు కానుక కల్యాణలక్ష్మి

చొప్పదండి: రాష్ట్రంలోని ఆడబిడ్డలకు ప్రభుత్వం కల్యాణలక్ష్మి కానుక అందించి పేదింటి బిడ్డలను ఆదుకుంటోందని ఎమ్మెల్యే అన్నారు. క్యాంపు కార్యాలయంలో శుక్రవారం చొప్పదండి మండలానికి చెందిన 67 మంది లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులు పంపిణీ చేశారు. చిట్యాలపల్లి గ్రామానికి చెందిన ఓ మహిళకు రెండు చెక్కులు అందజేశారు. ఇద్దరు బిడ్డల పెళ్లికి సర్కారు సాయం చేయడం పట్ల కుటుంబ సభ్యులు ఆనందం వ్యక్తం చేశారు. ఎంపీపీ చిలుక రవీందర్, ఏఎంసీ చైర్మన్ గడ్డం చుక్కారెడ్డి తదితరులున్నారు.

అర్హులందరికీ ఇళ్లు, ఇళ్ల స్థలాలివ్వాలి


మాట్లాడుతున్న శేఖర్

కరీంనగర్: అర్హులైన పేదలందరికీ ఇళ్లు, ఇళ్ల స్థలాలివ్వాలని ఏఐఎఫ్‌బీ జిల్లా ప్రధాన కార్యదర్శి బండారి శేఖర్ డిమాండ్ చేశారు. శుక్రవారం కరీంనగర్‌లోని పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సొంత జాగా ఉన్నవారికి ఇంటి నిర్మాణం కోసం రాష్ట్ర ప్రభుత్వం గృహలక్ష్మి పథకం ద్వారా ఇచ్చే రూ.3 లక్షలు సరిపోవన్నారు. సిమెంటు, ఇసుక, ఇటుక, ఇనుము ఇతర వస్తువుల ధరలు విపరీతంగా పెరిగాయన్నారు. రాష్ట్ర సర్కారు రూ.5 లక్షలు, కేంద్ర ప్రభుత్వం రూ.10 లక్షలు ఇవ్వాలని కోరారు. జీవో నంబర్ 58ని వెంటనే అమలు చేసి, పేదలు వేసుకున్న గుడిసెలకు పట్టాలివ్వాలన్నారు. కొంతమంది భూమాఫియా, రియల్ ఎస్టేట్ వ్యాపారులు కరీంనగర్ చుట్టుపక్కల ప్రభుత్వ భూములను కబ్జా చేశారని ఆరోపించారు. వాటిని 59 జీవో ద్వారా క్రమబద్ధీకరిస్తే ఊరుకునేది లేదన్నారు. పార్టీ జిల్లా కమిటీ సభ్యులు బెక్కంటి రమేశ్, జి.ప్రశాంత్ కుమార్, నాయకులు రాజు, ప్రశాంత్, శ్యాం తదితరులు పాల్గొన్నారు.

దళితబంధు యూనిట్ ప్రారంభం

హుజూరాబాద్‌రూరల్: మండలంలోని సింగాపూర్‌లో దళితబంధు పథకం కింద మంజూరైన వాహనాన్ని హుజూరాబాద్ సింగిల్ విండో చైర్మన్ ఎడవెల్లి కొండల్‌రెడ్డి, ధర్మారం సింగిల్ విండో చైర్మన్ శ్రీకాంత్‌రెడ్డి శుక్రవారం ప్రారంభించారు. నాయకులు, స్థానికులు పాల్గొన్నారు.

అన్నదాతలను ఆదుకోవాలి

ఇల్లందకుంట: పంటలు నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు ఎర్రబెల్లి సంపత్‌రావు డిమాండ్ చేశారు. శుక్రవారం మండలంలోని పలు గ్రామాల్లో అకాల వర్షానికి నేలకొరిగిన మొక్కజొన్న పంటలను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అకాల వర్షంతో రైతులు తీవ్రంగా నష్టపోయారని, తొమ్మిదేళ్లుగా ప్రకృతి వైపరీత్యాల వల్ల పంట నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోలేదని, ఫసల్‌బీమా పథకాన్ని రాష్ట్రంలో అమలు చేయాలని డిమాండ్ చేశారు. నియోజకవర్గ అసెంబ్లీ కన్వీనర్ మాడ గౌతమ్‌రెడ్డి, మండల అధ్యక్షుడు సింగిరెడ్డి తిరుపతిరెడ్డి, నాయకులు పవన్‌రెడ్డి, శ్రీపాల్‌రెడ్డి, మధుకర్‌రెడ్డి, అజయ్, మారం తిరుపతిరెడ్డి, వెంకట్‌రెడ్డి తదితరులున్నారు.

అగ్ని ప్రమాదాల నివారణపై అవగాహన


అవగాహన కల్పిస్తున్న ఫైర్ అధికారి పరమేశ్వర్

కరీంనగర్ క్రైం: నగరంలోని మీనాక్షి ఆసుపత్రిలో కరీంనగర్ ఫైర్ అధికారులు శుక్రవారం అగ్ని ప్రమాదాల నివారణకు తీసుకోవాల్సిన చర్యలను వివరించారు. స్టేషన్ ఫైర్ అధికారి పరమేశ్వర్ ఆసుపత్రి నిర్వాహకులు, వైద్యులు, సిబ్బందికి పూర్తిస్థాయిలో అవగాహన కల్పించారు. ఫైర్ సిబ్బంది పాల్గొన్నారు.